15-02-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - తండ్రి ముళ్ళను పుష్పాలుగా తయారుచేయడానికి వచ్చారు, తండ్రికి ముళ్ళ పైనా ప్రేమ ఉంది, అలాగే పుష్పాల పైనా ప్రేమ ఉంది, ముళ్ళనే పుష్పాలుగా తయారుచేయడానికి శ్రమిస్తారు"

ప్రశ్న:- ఏ పిల్లలలోనైతే జ్ఞాన ధారణ ఉంటుందో, వారి గుర్తులను వినిపించండి?

జవాబు:- వారు అద్భుతం చేసి చూపిస్తారు. వారు తమ మరియు ఇతరుల కళ్యాణం చేయకుండా ఉండలేరు. బాణం తగిలితే నష్టోమోహులుగా అయి ఆత్మిక సేవలో నిమగ్నమైపోతారు. వారి అవస్థ ఏకరసముగా, చలించకుండా-స్థిరంగా ఉంటుంది. వారు ఎప్పుడూ ఎటువంటి తెలివితక్కువ పని చేయరు. ఎవరికీ దుఃఖాన్ని ఇవ్వరు. అవగుణాల రూపీ ముళ్ళను తొలగించుకుంటూ వెళ్తారు.

ఓం శాంతి. తండ్రి పెద్ద లివర్ గడియారం వంటివారని పిల్లలకు తెలుసు. పూర్తిగా ఏక్యురేట్ సమయానికి ముళ్ళను పుష్పాలుగా తయారుచేయడానికి వస్తారు. ఒక్క క్షణం కూడా ఎక్కువ, తక్కువ అవ్వదు. కొద్దిగా కూడా తేడా రాదు. మధురాతి మధురమైన పిల్లలకు తెలుసు - ఈ సమయంలో ఇది కలియుగ ముళ్ళ అడవి. కావున పుష్పాలుగా తయారయ్యేవారికి - మేము పుష్పాలుగా తయారవుతున్నాము అన్నది అనుభవమవ్వాలి. మొదట మనమందరము ముళ్ళలా ఉండేవారము, కొందరు చిన్న ముళ్ళలా, కొందరు పెద్ద ముళ్ళలా ఉండేవారు. కొందరు చాలా దుఃఖాన్ని ఇస్తారు, కొందరు తక్కువ దుఃఖాన్ని ఇస్తారు. ఇప్పుడు తండ్రికైతే అందరి పైనా ప్రేమ ఉంది. ముళ్ళ పైనా ప్రేమ ఉంది, పుష్పాల పైనా ప్రేమ ఉంది అన్న గాయనం కూడా ఉంది. మొదట ఎవరిపై ప్రేమ ఉంది? తప్పకుండా ముళ్ళ పైనే ప్రేమ ఉంది. ఎంత ప్రేమ ఉందంటే, కష్టపడి వారిని ముళ్ళ నుండి పుష్పాలుగా తయారుచేస్తారు. వారు ముళ్ళ ప్రపంచంలోకే వస్తారు. ఇందులో సర్వవ్యాపి విషయము ఉండదు. ఒక్కరి మహిమయే జరుగుతుంది. ఆత్మ శరీరాన్ని ధారణ చేసి పాత్రను అభినయించినప్పుడు ఆత్మకే మహిమ జరుగుతుంది. శ్రేష్ఠాచారిగానూ ఆత్మయే అవుతుంది, భ్రష్టాచారిగానూ ఆత్మయే అవుతుంది. ఆత్మ శరీరాన్ని ధారణ చేసి ఎటువంటి కర్మలు చేస్తుందో, దాని అనుసారంగా వీరు కుకర్మలు చేసేవారు లేక వీరు సుకర్మలు చేసేవారు అని అనడం జరుగుతుంది. ఆత్మయే మంచి లేక చెడు కర్మలను చేస్తుంది. స్వయాన్ని ప్రశ్నించుకోండి - మీరు సత్యయుగ దైవీ పుష్పములా ఉన్నారా లేక కలియుగ అసురీ ముల్లులా ఉన్నారా? సత్యయుగం ఎక్కడ, కలియుగం ఎక్కడ! దేవతలెక్కడ, అసురులెక్కడ! ఎంతో తేడా ఉంది. ముళ్ళలా ఎవరైతే ఉంటారో, వారు స్వయాన్ని పుష్పాలుగా పిలుచుకోలేరు. పుష్పాలు సత్యయుగంలో ఉంటారు, కలియుగంలో ఉండరు. ఇప్పుడిది సంగమయుగము, ఇప్పుడు మీరు ముళ్ళ నుండి పుష్పాలుగా అవుతారు. టీచర్ పాఠం చెప్తారు, పిల్లల పని దానిని రిఫైన్ చేసి చెప్పడము. అందులో ఇది కూడా వ్రాయండి - ఒకవేళ మీరు పుష్పముగా అవ్వాలనుకుంటే స్వయాన్ని ఆత్మగా భావించండి మరియు పుష్పముగా తయారుచేసే పరమపిత పరమాత్మను స్మృతి చేయండి, తద్వారా మీ అవగుణాలు తొలగిపోతాయి మరియు మీరు సతోప్రధానంగా అయిపోతారు. బాబా వ్యాసమును ఇస్తారు. పిల్లల పని దానిని సరిదిద్ది ముద్రించడము. అప్పుడు అది చూసి మనుష్యులందరూ ఆలోచనలో పడతారు. ఇది చదువు. బాబా మీకు అనంతమైన చరిత్ర-భౌగోళికములను చదివిస్తారు. ఆ స్కూళ్ళలోనైతే పాత ప్రపంచ చరిత్ర-భౌగోళికములను చదివించడం జరుగుతుంది. కొత్త ప్రపంచ చరిత్ర-భౌగోళికముల గురించి ఎవరికీ తెలియనే తెలియదు. కావున ఇది చదువు కూడా మరియు అర్థం చేయించడం కూడా. ఏవైనా అశుద్ధమైన పనులను చేయడమనేది అవివేకము. అప్పుడు - దుఃఖాన్ని ఇచ్చే ఈ వికారీ పనులను చేయకూడదు అని అర్థం చేయించడం జరుగుతుంది. దుఃఖహర్త, సుఖకర్త అనేది తండ్రి మహిమ కదా. ఇక్కడ మీరు కూడా - ఎవ్వరికీ దుఃఖాన్ని ఇవ్వకూడదు అనేది నేర్చుకుంటున్నారు. తండ్రి శిక్షణను ఇస్తున్నారు - ఎల్లప్పుడూ సుఖాన్నే ఇస్తూ ఉండండి. ఈ అవస్థ అంత తొందరగా ఏమీ తయారవ్వదు. తండ్రి ఇచ్చే వారసత్వాన్ని అయితే క్షణములో తీసుకోవచ్చు, కానీ యోగ్యులుగా తయారవ్వడానికి సమయం పడుతుంది. అనంతమైన తండ్రి ఇచ్చే వారసత్వము స్వర్గ రాజ్యాధికారము అని భావిస్తారు. పారలౌకిక తండ్రి నుండి భారత్ కు విశ్వ రాజ్యాధికారం లభించింది అని మీరు అర్థం చేయిస్తూ కూడా ఉండవచ్చు. మీరందరూ విశ్వాధిపతులుగా ఉండేవారు. పిల్లలైన మీకు లోలోపల ఈ సంతోషం ఉండాలి. ఇది నిన్నటి విషయమే, మీరు స్వర్గాధిపతులుగా ఉండేవారు. మనుష్యులు లక్షలాది సంవత్సరాలు అని అనేస్తారు. ఒక్కొక్క యుగము యొక్క ఆయువును లక్షల సంవత్సరాలు అని అనడం ఎక్కడ, మొత్తం కల్పమంతటికీ 5,000 సంవత్సరాల ఆయువు ఎక్కడ. ఎంతో తేడా ఉంది.

జ్ఞానసాగరుడు ఒక్క అనంతమైన తండ్రే. వారి నుండి దైవీ గుణాలను ధారణ చేయాలి. ఈ ప్రపంచములోని మనుష్యులు రోజురోజుకు తమోప్రధానముగా అవుతూ ఉంటారు. ఎక్కువగా అవగుణాలను నేర్చుకుంటూ ఉంటారు. ఇంతకుముందు ఇంతటి అవినీతి, కల్తీ, భ్రష్టాచారము ఉండేవి కావు, ఇప్పుడు పెరిగిపోతూ ఉన్నాయి. ఇప్పుడు మీరు తండ్రి స్మృతి బలముతో సతోప్రధానముగా అవుతూ ఉన్నారు. ఏ విధంగానైతే దిగుతారో, అదే విధంగా మళ్ళీ తిరిగి వెళ్ళాలి కూడా. మొదటైతే తండ్రి లభించారు అన్న సంతోషం ఉంటుంది, కనెక్షన్ జోడించబడింది, ఆపై స్మృతియాత్ర. ఎవరైతే ఎక్కువ భక్తిని చేసి ఉంటారో, వారి స్మృతియాత్ర ఎక్కువగా ఉంటుంది. చాలామంది పిల్లలు అంటారు - బాబా, స్మృతి నిలవడం లేదు. భక్తిలో కూడా అలా అవుతుంది. కథ వినడానికి కూర్చున్నప్పుడు బుద్ధి వేరే వైపులకు పరుగెడుతుంది. వినిపించేవారు చూస్తూ ఉంటారు, అప్పుడు ఉన్నట్లుండి నేను ఏం వినిపించాను అని అడిగితే తికమక పడతారు. కొందరైతే వెంటనే చెప్పేస్తారు. అందరూ ఒకే విధంగా ఉండరు కదా. ఇక్కడ కూర్చొని ఉన్నా కానీ ధారణ ఏమీ ఉండదు. ఒకవేళ ధారణ ఉంటే, అద్భుతం చేసి చూపిస్తారు. వారు తమ మరియు ఇతరుల కళ్యాణము చేయకుండా ఉండలేరు. ఒకవేళ ఎవరికైనా తమ ఇంట్లో ఎంతో సుఖం ఉన్నా, మహళ్ళు, మోటార్లు మొదలైనవి ఉన్నా, ఒకసారి బాణం తగిలితే ఇక అంతే, నేను ఈ ఆత్మిక సేవను చేయాలనుకుంటున్నాను అని తమ పతికి చెప్తారు. కానీ మాయ చాలా శక్తివంతమైనది, అది చేయనివ్వదు. మోహం ఉంటుంది కదా. ఇన్ని మహళ్ళను, ఇంతటి సుఖాన్ని ఎలా వదులుతారు. అరే, మొదట్లో ఇంతమంది పరుగెత్తుకుని వచ్చారు కదా, వారంతా పెద్ద-పెద్ద లక్షాధికారులు, కోటీశ్వరుల ఇంటివాళ్ళు, అన్నీ వదిలేసి వచ్చేసారు. ఇది భాగ్యాన్ని చూపిస్తుంది. వాటిని వదిలేందుకు అంతటి శక్తి లేదు. రావణుడి సంకెళ్ళలో చిక్కుకుని ఉన్నారు. ఇవి బుద్ధి యొక్క సంకెళ్ళు. తండ్రి అర్థం చేయిస్తున్నారు - అరే, మీరు స్వర్గాధిపతులుగా, పూజ్యులుగా అవుతారు! తండ్రి గ్యారంటీ ఇస్తున్నారు, 21 జన్మలు మీరు ఎప్పుడూ రోగగ్రస్తులుగా అవ్వరు. సదా ఆరోగ్యవంతులుగా 21 జన్మల కొరకు ఉంటారు. మీరు పతి వద్దనే ఉండండి కానీ కేవలం - పవిత్రంగా అవుతాను మరియు తయారుచేస్తాను అన్నదానికి అనుమతిని తీసుకోండి. తండ్రిని స్మృతి చేయడం మీ కర్తవ్యము, తద్వారా మీకు అపారమైన సుఖము లభిస్తుంది. స్మృతి చేస్తూ, చేస్తూ తమోప్రధానము నుండి సతోప్రధానముగా అయిపోతారు. ఇది ఎంతగా అర్థం చేసుకోవలసిన విషయము. శరీరంపై నమ్మకము లేదు. తండ్రికి చెందినవారిగానైతే అవ్వండి. వారి వంటి ప్రియమైన వస్తువు ఇంకేదీ లేదు. తండ్రి విశ్వాధిపతులుగా తయారుచేస్తారు, వారు అంటారు, ఎంత కావాలనుకుంటే అంత సతోప్రధానముగా అవ్వండి. మీరు అపారమైన సుఖాన్ని చూస్తారు. తండ్రి స్వర్గ ద్వారాలను ఈ నారీల ద్వారా తెరిపిస్తారు. మాతలపైనే జ్ఞాన కలశాన్ని పెట్టడం జరుగుతుంది. బాబా మాతలనే ట్రస్టీలుగా చేసారు, అంతటినీ మాతలైన మీరే సంభాళించండి అని అన్నారు. ఇతని ద్వారా కలశాన్ని పెట్టారు కదా. దానికి గుర్తుగా వారు - సాగర మంథనం చేసారని, అమృతము యొక్క కలశాన్ని లక్ష్మికి ఇచ్చారని వ్రాసారు. బాబా స్వర్గ ద్వారాలను తెరుస్తున్నారని ఇప్పుడు మీకు తెలుసు. మరి మనం బాబా నుండి వారసత్వాన్ని ఎందుకు తీసుకోకూడదు, విజయమాలలో ఎందుకు స్మరింపబడకూడదు, మహావీరులుగా ఎందుకు అవ్వకూడదు. అనంతమైన తండ్రి పిల్లలను ఒడిలోకి తీసుకుంటారు, ఎందుకని? స్వర్గాధిపతులుగా తయారుచేయడానికి. వారు కూర్చుని పూర్తిగా ముళ్ళలా ఉన్నవారికి శిక్షణను ఇస్తారు. కావున ముళ్ళ పైన కూడా ప్రేమ ఉంది కదా, కావుననే వారిని పుష్పాలుగా తయారుచేస్తారు. తండ్రిని పతిత ప్రపంచములోకి మరియు పతిత శరీరములోకే పిలుస్తారు, నిర్వాణధామాన్ని వదిలి ఇక్కడకు రండి అని పిలుస్తారు. తండ్రి అంటారు, డ్రామానుసారంగా నేను ముళ్ళ ప్రపంచములోకే రావలసి వస్తుంది. అంటే తప్పకుండా ప్రేమ ఉందనే కదా. ప్రేమ లేకుండా పుష్పాలుగా ఎలా తయారుచేస్తారు? ఇప్పుడు మీరు కలియుగ ముళ్ళ నుండి సత్యయుగ దేవతలుగా, సతోప్రధానులుగా, విశ్వాధిపతులుగా అవ్వండి. ఎంత ప్రేమగా అర్థం చేయించడం జరుగుతుంది. కుమారీ పుష్పము వలె ఉంటుంది, కావుననే అందరూ ఆమె చరణాలపై పడతారు. ఆమె ఎప్పుడైతే ముల్లులా (పతితముగా) అవుతుందో, అప్పుడు ఆమె అందరి ముందు తల వంచి నమస్కరించవలసి ఉంటుంది. అందుకే ఏం చేయాలి? అలా పుష్పములానే ఉండిపోవాలి, అప్పుడు సదా పుష్పముగా అయిపోతారు. కుమారీ తన జన్మను వికారాల ద్వారా తీసుకున్నా కానీ ఆమె అయితే నిర్వికారియే కదా. ఏ విధముగా సన్యాసులు జన్మనైతే వికారాల ద్వారానే తీసుకుంటారు కదా. వివాహం చేసుకుని మళ్ళీ ఇళ్ళూ-వాకిళ్ళకు విడాకులు ఇచ్చేస్తారు, అటువంటివారిని వాళ్ళు మహాన్ ఆత్మలు అని అంటారు. విశ్వాధిపతులైన ఆ సత్యయుగములోని మహాన్ ఆత్మలు ఎక్కడ, ఈ కలియుగము వారెక్కడ! అందుకే బాబా అన్నారు - ఈ ప్రశ్నను వ్రాయండి, మీరు కలియుగ ముళ్ళ వంటివారా లేక సత్యయుగ పుష్పాలా? భ్రష్టాచారులా లేక శ్రేష్టాచారులా?

ఇది భ్రష్టాచారీ ప్రపంచము, ఈ సమయములో ఇది రావణ రాజ్యము. ఇది అసురీ రాజ్యం, రాక్షస రాజ్యం అని అంటారు. కానీ స్వయాన్ని ఆ విధముగా భావిస్తారా. ఇప్పుడు పిల్లలైన మీరు యుక్తిగా ప్రశ్నలు అడుగుతారు, అప్పుడు వారు

తమంతట తామే అర్థం చేసుకుంటారు - తప్పకుండా మేము కాముకులము, క్రోధులము, లోభులము అని. ప్రదర్శనీలో కూడా ఈ విధంగా వ్రాసినట్లయితే వారికి - నేను కలియుగ ముల్లును అని ఫీలింగ్ వస్తుంది. ఇప్పుడు మీరు పుష్పాలుగా అవుతున్నారు. బాబా అయితే సదా పుష్పము. వారు ఎప్పుడూ ముల్లులా అవ్వరు. మిగిలినవారంతా ముళ్ళలా అవుతారు. ఆ పుష్పము అంటున్నారు - నేను మిమ్మల్ని కూడా ముళ్ళ నుండి పుష్పాలుగా తయారుచేస్తాను. మీరు నన్ను స్మృతి చేయండి. మాయ ఎంత శక్తివంతమైనది. మరి మీరు మాయకు చెందినవారిగా అవ్వాలా? తండ్రి మిమ్మల్ని తన వైపుకు లాగుతారు, మాయ తన వైపుకు లాగుతుంది. ఇది పాత చెప్పు. ఆత్మకు మొదట కొత్త చెప్పు లభిస్తుంది, ఆ తర్వాత అది పాతబడుతుంది. ఈ సమయంలో అన్ని చెప్పులూ తమోప్రధానముగా ఉన్నాయి. నేను మిమ్మల్ని మఖమల్ లా తయారుచేస్తాను. అక్కడ ఆత్మ పవిత్రంగా ఉన్న కారణంగా శరీరం కూడా మఖమల్ దే లభిస్తుంది. ఏ లోపాలూ ఉండవు. ఇక్కడైతే ఎన్నో లోపాలు ఉన్నాయి. అక్కడి ముఖకవళికలు చూడండి, ఎంత సుందరంగా ఉన్నాయి. అటువంటి ముఖకవళికలను ఇక్కడ ఎవ్వరూ తయారుచేయలేరు. ఇప్పుడు తండ్రి కూడా అంటున్నారు - నేను మిమ్మల్ని ఎంత ఉన్నతంగా తయారుచేస్తున్నాను. ఇంట్లో గృహస్థములో ఉంటూ కమలపుష్ప సమానంగా పవిత్రంగా అవ్వండి మరియు జన్మజన్మాంతరాల తుప్పు ఏదైతే పట్టి ఉందో దానిని తొలగించుకునేందుకు యోగాగ్ని ఉంది. ఇందులో అన్ని పాపాలు భస్మమైపోతాయి. మీరు పక్కా బంగారముగా అయిపోతారు. మలినాలను తొలగించుకునేందుకు చాలా మంచి యుక్తిని తెలియజేస్తారు - నన్నొక్కరినే స్మృతి చేయండి. మీ బుద్ధిలో ఈ జ్ఞానం ఉంది. ఆత్మ కూడా చాలా చిన్నది. అది పెద్దదైనట్లయితే ఇందులోకి ప్రవేశించలేదు. ఎలా ప్రవేశిస్తుంది? ఆత్మను చూడడానికి డాక్టర్లు ఎంతో కష్టపడుతూ ఉంటారు. కానీ అది కనిపించదు, సాక్షాత్కారమవుతుంది. కానీ సాక్షాత్కారము వల్లనైతే లాభమేమీ ఉండదు. ఒకవేళ మీకు వైకుంఠము యొక్క సాక్షాత్కారం జరిగినా దాని వలన లాభమేముంది! ఎప్పుడైతే పాత ప్రపంచము సమాప్తమవుతుందో, అప్పుడు వైకుంఠవాసులుగా అవుతారు. దీని కొరకు మీరు యోగాభ్యాసము చేయండి.

తండ్రి అర్థం చేయిస్తున్నారు - పిల్లలూ, మొదట ముళ్ళ పైన ప్రేమ ఉంటుంది. అందరికన్నా పెద్ద ప్రేమసాగరుడు తండ్రి. పిల్లలైన మీరు కూడా మధురముగా అవుతూ ఉంటారు. తండ్రి అంటారు, స్వయాన్ని ఆత్మగా భావిస్తూ సోదరులను చూడండి, అప్పుడు అశుద్ధమైన ఆలోచనలు పూర్తిగా తొలగిపోతాయి. సోదరీ-సోదర సంబంధముతో కూడా బుద్ధి చంచలమవుతుంది, అందుకే సోదరులనే చూడండి. భానములోకి వచ్చేందుకు లేక మోహము వెళ్ళేందుకు అసలు అక్కడ శరీరమే ఉండదు. తండ్రి ఆత్మలనే చదివిస్తారు. కావున మీరు కూడా స్వయాన్ని ఆత్మగా భావించండి. ఈ శరీరము వినాశీ, దీనిపై మనసు పెట్టుకోకూడదు. సత్యయుగములో దీనిపై ప్రీతి ఉండదు. మోహజీత్ రాజు కథను విన్నారు కదా. అతను ఇలా అన్నారు - ఆత్మ ఒక శరీరాన్ని వదిలి వెళ్ళి ఇంకొక శరీరాన్ని తీసుకుంటుంది, పాత్ర లభించింది, మోహము ఎందుకు పెట్టుకోవాలి? అందుకే బాబా కూడా అంటారు - జాగ్రత్తగా ఉండండి. తల్లి మరణించినా లేక భార్య మరణించినా హల్వా తినండి. ఎవ్వరు మరణించినా కానీ మేము ఏడవము అని ప్రతిజ్ఞ చేయండి. మీరు మీ తండ్రిని స్మృతి చేయండి, సతోప్రధానముగా అవ్వండి. సతోప్రధానముగా అవ్వడానికి ఇంకే మార్గము లేదు. పురుషార్థము ద్వారానే విజయమాలలోని మణులుగా అవుతారు. పురుషార్థము ద్వారా ఎలా కావాలనుకుంటే అలా అవ్వగలుగుతారు. కల్పపూర్వము ఎంత పురుషార్థం చేసి ఉంటే అంతే చేస్తారు అని తండ్రి అయితే అర్థం చేసుకుంటారు. తండ్రి పేదల పాలిటి పెన్నిధి. దానాన్ని కూడా పేదవారికే ఇవ్వడం జరుగుతుంది. తండ్రి స్వయం అంటున్నారు, నేను కూడా సాధారణ తనువులోకి వస్తాను, పేదవాని తనువులోకి రాను, షావుకారు తనువులోకి రాను. పిల్లలైన మీకే తండ్రి గురించి తెలుసు, మిగిలిన ప్రపంచమంతా సర్వవ్యాపి అని అనేస్తారు. తండ్రి ఎటువంటి ధర్మాన్ని స్థాపన చేస్తారంటే, అక్కడ దుఃఖము యొక్క మాటే ఉండదు.

భక్తి మార్గములో మనుష్యులు ఆశీర్వాదాలను కోరుకుంటారు. ఇక్కడైతే కృప యొక్క విషయమేదీ లేదు. ఎవరికి తల వంచి నమస్కరిస్తారు? వారు ఒక బిందువు కదా. ఏదైనా పెద్ద వస్తువైతే నమస్కరించవచ్చు కూడా. కానీ చిన్న వస్తువుకు తల వంచి నమస్కరించలేరు. ఎవరికి చేతులు జోడిస్తారు. ఈ భక్తి మార్గపు గుర్తులన్నీ మాయమైపోతాయి. చేతులు జోడించడం భక్తి మార్గమవుతుంది. సోదరీ-సోదరులు పరస్పరం ఇంట్లో చేతులు జోడిస్తారా? వారసునిగా చేసుకునేందుకే కొడుకును కోరుకుంటారు. కొడుకు యజమాని అవుతాడు కదా, అందుకే తండ్రి పిల్లలకు నమస్కరిస్తారు. తండ్రి అయితే పిల్లల యొక్క సేవాధారి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక

పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. వినాశీ శరీరముపై మనస్సు పెట్టుకోకూడదు. మోహజీతులుగా అవ్వాలి, ఎవరు శరీరము వదిలినా కానీ మేము ఎప్పుడూ ఏడవము అని ప్రతిజ్ఞ చేయండి.

2. తండ్రి సమానంగా మధురముగా అవ్వాలి, అందరికీ సుఖాన్ని ఇవ్వాలి. ఎవ్వరికీ దుఃఖాన్ని ఇవ్వకూడదు. ముళ్ళను పుష్పాలుగా తయారుచేసే సేవను చేయాలి. తమ మరియు ఇతరుల కళ్యాణాన్ని చేయాలి.

వరదానము:- శుభచింతన ద్వారా నెగెటివ్ ను పాజిటివ్ లోకి పరివర్తన చేసే శుభచింతక భవ

సదా సమర్థముగా ఉండేందుకు కేవలము రెండు పదాలను గుర్తు ఉంచుకోండి - శుభచింతన మరియు శుభచింతకులు. శుభచింతన ద్వారా నెగెటివ్ ను పాజిటివ్ లోకి పరివర్తన చెయ్యగలరు. శుభచింతన మరియు శుభచింతకులు - ఈ రెండింటికీ పరస్పరంలో సంబంధము ఉంది. ఒకవేళ శుభచింతన లేకపోతే శుభచింతకులుగా కూడా అవ్వలేరు. వర్తమాన సమయములో ఈ రెండు విషయాల పట్ల అటెన్షన్ పెట్టండి ఎందుకంటే చాలా సమస్యలు ఎలా ఉన్నాయంటే, మనుష్యులు ఎలా ఉన్నారంటే, వారు వాణి ద్వారా అర్థం చేసుకోరు కానీ శుభచింతకులుగా అయ్యి వైబ్రేషన్లను ఇచ్చినట్లయితే మారిపోతారు.

స్లోగన్:- జ్ఞాన రత్నాలతో, గుణాలతో మరియు శక్తులతో ఆడుకోండి, మట్టితో కాదు.